క్లుప్తంగా

ఎమ్మెల్యే రామరాజుకు గ్రంధి పరామర్శ



ఎమ్మెల్యే రామరాజును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం : ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు ఇటీవల అనారోగ్యానికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సోమవారం సాయంత్రం ఆయనను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఆధునీకీకరించిన డ్వామా కార్యాలయం ప్రారంభం



డ్వామా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి

భీమవరం (ప్రకాశం చౌక్) : కలెక్టరేట్‌లో నూతనంగా ఆధునీకరించిన డ్వామా కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సోమవారం ప్రారంభించారు. అనంతరం కార్యాలయాన్ని ఆమె పరిశీలించారు. జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డ్వామా అధికారులకు సూచించారు. డ్వామా పీడీ ఎస్టీవీ రాజేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా విభజన అనంతరం స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన డ్వామా కార్యాలయానికి గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో కొన్ని మరమ్మతులు, ఛాంబర్‌ల ఏర్పాటు తదితర పనులను చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో జూనియర్ ఇంజినీర్లు శ్రీనివాస్, ఆనంద్, టెక్నికల్ అసిస్టెంట్లు ప్రవీణ్, ఒమేగా రావు, సుధీర్, సీడీఓ శ్రీమతి కనకదుర్గ పాల్గొన్నారు.

గాంధీజీకి నివాళి



గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : దేశ చరిత్రలో గాంధీ మరణం దుర్దినమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో సీపీఎం జిల్లా కమిటీ సమావేశం సందర్భంగా మహాత్మా గాంధీ వర్ధంతి సభ ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జేఎన్వీ గోపాలన్ అధ్యక్షతన జరిగింది. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం, సీహెచ్.బాబురావు, కేతా గోపాలన్, బి.వాసుదేవరావు పాల్గొన్నారు.

అలరించిన ప్రదర్శనలు

భీమవరం (ప్రకాశం చౌక్) : శ్రీమావుళ్లమ్మ అమ్మవారి 59వ వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను అలరించాయి. సాయంత్రం 5గంటలకు భారతీయ రాఘవ నృత్య కేంద్రం భీమవరం వారిచే కూచిపూడి జానపద నృత్యాలు, రాత్రి 7.30 గంటలకు పులగం శివనాగ నర్సింహరావు అనాకోడేరు వారిచే దుర్యోదన ఏకపాత్ర, రాత్రి 8 గంటలకు శ్రీమావుళ్లమ్మ నాట్యమండలి భీమవరం వారిచే బాల నాగమ్మ నాటకం ప్రదర్శించారు. నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

సాక్షి, భీమవరం : భీమవరం టూటౌన్ ప్రాంతంలోని బీసీ కాలనీకి చెందిన కె.శ్రీనివాస్ అనే వ్యక్తి ఈనెల 23వ తేది నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఏఎస్సై ఎండీ బాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పవన్‌కు జోగయ్య లేఖ

పాలకొల్లు సెంట్రల్: జనసేన పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో రూపొందించాల్సిన అంశాలపై ఆ పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు రాసిన లేఖను కాపు సంక్షేమ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు చేగొండి హరిరామ జోగయ్య సోమవారం సాయంత్రం విడుదల చేశారు. ఫిబ్రవరిలో ఏదో ఒకరోజు సమయం కేటాయిస్తే విజయవాడ వచ్చి ఆయన్ని కలుస్తామని పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన

నరసాపురం రూరల్: లక్ష్మణేశ్వరం గ్రామ సచివాయంలో సోమవారం మండల న్యాయసేవాసంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. వినియోగదారుల చట్టాలపై అవగాహన కల్పించారు. కొనుగోలు చేసిన వస్తువుకు వారంటీ ఉన్నప్పటికీ ఉచితంగా రిపేరు చేయకపోతే వినియోగదారుల ఫోరానికి ఫిర్యాదు చేసి నష్టపరిహారం పొందవచ్చని మండల నాయయసేవా సంస్థ ఉచిత న్యాయవాది గన్నాబత్తుల శివాజీ చక్రవర్తి అన్నారు.

పేకాట స్థావరంపై దాడి

పాలకోడేరు : శృంగవృక్షం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సోమవారం పోలీసులు దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ధనుంజయ్ తెలిపారు.

ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం

- డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నరసింహరాజు
- ప్రాతళ్లమెరకలో గడపగడపకు మన ప్రభుత్వం



అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పీవీఎల్

కాళ్ల : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన సాగిస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అన్నారు. కాళ్ల మండలం ప్రాతాళ్లమెరక గ్రామంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ పార్టీ అధ్యక్షుడు వేగేశ్న బాలగణపతి వర్మ, సాగిరాజు హరివర్మ ఆధ్వర్యంలో ప్రతి గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ ప్రతిపక్షాలకు ఏమాత్రం నిబద్ధత ఉన్నా వారి పాలనలో ప్రజలకు ఏం మేలు జరిగిందో, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు జరిగిన మేలేంటో తెలుసుకునేందుకు ముందుకు రావాలని కోరారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. నాడు నేడు పథకంతో పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడమే కాకుండా అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ప్రోత్సాహం అందిస్తున్నారని అన్నారు. మహిళలకు సంక్షేమ పథకాలు నేరుగా అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు అసహనంతో కుట్రలు పన్నుతున్నారని, వారు ఎన్ని కల్లబొల్లి కబుర్లు చెప్పినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని గెలిపించి జగనన్నకు కానుకగా ఇవ్వాలని కోరారు. ఇందుకోసం పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రాతాళ్లమెరక గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. తొలుత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దివంగత నేత వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, ఎంపీపీ పెన్మెత్స విశ్వనాథరాజు, పార్టీ మండల కన్వీనర్ గణేశ్న రాంబాబు, గ్రామ అధ్యక్షుడు వేగేశ్న బాల గణపతివర్మ, సాగిరాజు హరివర్మ, పాలకోడేరు ఎంపీపీ భూపతిరాజు చంటిరాజు, వేజెళ్ళ సతీష్, అల్లూరి కృష్ణంరాజు, కె.మణివర్మ, పెన్మెత్స రంగరాజు, వీరమల్లు బోసు, వేగేశ్న విజయరామరాజు, రుద్రరాజు రామకృష్ణంరాజు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

నేడు పల్లిపాలెంలో గడప గడపకు

కాళ్ల మండలం ప్రాతళ్లమెరక పరిధిలోని పల్లిపాలెం గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం 3గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నరసింహరాజు సోమవారం తెలిపారు. నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

రాజాం మునిసిపల్ కమిషనర్‌కు సత్కారం



భీమవరంలో తులసీ వెంకటకృష్ణారావును సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : విజయనగరం జిల్లా రాజాం మునిసిపల్ కమిషనర్ దొడ్డిగర్ల తులసీ వెంకటకృష్ణారావును సోమవారం భీమవరంలో ఘనంగా సత్కరించారు. భీమవరం పట్టణానికి చెందిన ఆయన రాజాంలో పనిచేస్తున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ కమిషనర్ అవార్డు అందుకున్న ఆయనను స్థానిక 11వ వార్డులోని రాజ్‌ట్రస్ట్ కార్యాలయంలో దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్, రాజ్ ట్రస్ట్ ఫౌండర్ గంటా రాజ్‌కుమార్, అద్దంకి డేవిడ్, గొల్ల రాజ్‌కుమార్, దొడ్డిగర్ల గంగాధరరావు, పాలపర్తి జోనా, మగాపు సైమాన్, ఆలమూరి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



సీఎం సహాయ నిధి చెక్కు అందచేస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం : ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం అని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణానికి చెందిన పి.పద్మావతి అనారోగ్యంతో చికిత్స పొందడంతో సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.80 వేల చెక్కును సోమవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, సీఎం సహాయ నిధి, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ప్రజారోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు.

సత్తా చాటిన శృంగవృక్షం విద్యార్థులు



చిత్రలేఖనంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

పాలకోడేరు : అమీర్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో నెల్లూరు నందు 7వ అఖిలభారత స్థాయిలో ఆదివారం విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం పోటీలో శృంగవృక్షం విద్యార్థులు సత్తా చాటారు. ఈ పోటీల్లో శృంగవృక్షం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని తాటిపాక కెజియా ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్ గెలుచుకుందని డ్రాయింగ్ టీచర్ దాడి వీరవెంకట సత్యనారాయణ తెలిపారు. అలాగే ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులు దైవాల లోహిత్ శ్రీ, గంగునేని నెహల్ బంగారు బాబు, తంగేళ్ల మానస శ్రీ వల్లి, లంకపల్లి ప్రణీత్ కుమార్, వేంద్ర పూర్ణ వెంకట్, పుల్లి ఉషా, దైవాల సాయి కృష్ణ, వీరవల్లి జనని, వీరవల్లి గృహాజలీకు అమీర్ ఆర్ట్ అకాడమీ అవార్డులు సర్టిఫికెట్లు అందజేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను, డ్రాయింగ్ టీచర్ సత్యనారాయణను ప్రధానోపాధ్యాయులు తోట కాశీ జగ్గనాధరావు అభినందించారు.

తరటావలో జగనన్న భూహక్కు సర్వే



తరటావలో నిర్వహిస్తున్న జగనన్న భూ హక్కు సర్వే

ఆకివీడు : జగనన్న సంపూర్ణ భూహక్కు సర్వే కార్యక్రమం మండలంలో వేగవంతంగా జరుగుతుందని తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు చెప్పారు. మండలంలోని అజ్జమూరు, మాదివాడ గ్రామాల్లో సర్వే పూర్తయ్యిందని, సోమవారం తరటావ గ్రామంలో సర్వే చేసినట్లు తెలిపారు. డ్రోన్ సహాయంతో సర్వే వేగవంతం చేశామన్నారు. భూమి యజమానులకు తమ భూమిని దస్తావేజుల ప్రకారం పూర్తిగా హద్దులు నిర్ణయించి, అప్పగిస్తామని చెప్పారు. సర్వే కార్యక్రమంలో సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన ఎంఎస్ఆర్.మూర్తి, కె.వరప్రసాద్, డ్రోన్ పైలెట్ జీ.శేషుకుమార్, సర్వేయర్లు ఎన్.ప్రవీణ్, రత్నవల్లి, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

శునకాలకు టీకాలు తప్పనిసరి



కుక్కలకు టీకాలు వేస్తున్న అధికారులు, చిత్రంలో ఎంపీపీ హరిబాబు, డీడీ జాఫర్‌హుస్సేన్

ఉండి : స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో పశు సంవర్ధకశాఖ, ఉండి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం జంతు సంరక్షణ పక్షోత్సవం నిర్వహించారు. ఎంపీపీ ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ జాఫర్‌హుస్సేన్ మాట్లాడుతూ జంతువులు మానవ జీవితంలో ఓ భాగమని వాటిని హింసించడం తగదని అన్నారు. పెంపుడు జంతువులను పట్ల చూపిస్తున్న జాలి, దయ వీధిలో సంచరించే జంతువులపైనా చూపించాలన్నారు. వైద్యుల సూచనలతో కుక్కలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకుడు డాక్టర్ జీ మల్లేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ కె.కొండలరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కమతం బెనర్జీ తదితరులు మాట్లాడుతూ సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించిందని, పశువుల ఇబ్బందికర పరిస్థితి వస్తే వెంటనే వారికి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు గాదిరాజు రంగరాజు, కలిదిండి సీతారామరాజు, రుద్దరాజు నరసరాజు, సత్తి బ్రమ్మారెడ్డి, గాదిరాజు వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అశ్రద్ధ చేయొద్దు



ప్రజా సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్ సూర్యతేజ

నరసాపురం: స్పందన ఫిర్యాదుల పరిష్కారంలో అశ్రద్ధ చేస్తే చర్యలు తప్పవని అధికారులను సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ హెచ్చరించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజా సమస్యలపై 28 ఫిర్యాదులు అందించినట్టు చెప్పారు. వృద్ధులు, నడవలేని వారి వద్దకే సబ్‌కలెక్టర్ వెళ్లి వినతులు స్వీకరించారు. రేషన్‌కార్డులు, హౌసింగ్, భూతగాదాలు తదితర అంశాలపై ఎక్కువ ఫిర్యాదులు అందాయన్నారు. మండల స్థాయిలో సమస్యలు పరిష్కారం కాకుంటేనే డివిజన్ స్థాయిలో ఫిర్యాదు చేయాలని సూచించారు. వ్యక్తిగత తగవులు, కోర్టు వివాదాల్లో ఉన్న సమస్యలు స్పందన కార్యక్రమంలోకి తీసుకురాకపోవడం మంచిదన్నారు. సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారులు, వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మోటార్‌సైకిల్ చోరీపై కేసు

పాలకోడేరు: రొయ్యల చెరువు వద్ద ఉంచిన మోటార్‌సైకిల్ చోరీకి గురైన ఘటన మండలంలోని కోరుకొల్లులో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పాలకోడేరు మండలం కోరుకొల్లు గ్రామంలో మంతెన వెంకట పల్లపురాజు రొయ్యల చెరువు వద్ద అత్తిలి మండలం ఈడూరుకు చెందిన పెరికి వీరపండు కాపలా ఉంటున్నాడు. గతేడాది నవంబర్ 23వ తేదీన చెరువు వద్ద ఉంచిన మోటర్ బైక్ తెల్లారేసరికి కనిపించకుండా పోయింది. అప్పటినుంచి పలుచోట్ల వెతికినా ఫలితం లేకుండా పోయింది దీంతో వీర పండు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ధనుంజయ్ తెలిపారు.

వరిలో ఆకు ఎండుతెగులు

పెనుమంట్ర: బ్రాహ్మణచెరువులో రైతు గునుపూడి మురళీకృష్ణకు చెందిన వరి చేనును మండల వ్యవసాయశాఖ అధికారిణి ఎం.జయ దుర్గామాధురి సోమవారం సందర్శించారు. అక్కడక్కడా దుబ్బులు చనిపోవడాన్ని గుర్తించారు. ఇది ఆకు ఎండు తెగులని, చేలోని నీటిని బటకు వదిలేసి మూడు నుంచి నాలుగు రోజులు ఆరగట్టిన తరువాత ప్లాంటామైసిన్ 50 గ్రాములు, కొసైడ్ 250 గ్రాముల మందును కలిపి ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. ఈ తెగులు కనిపించిన వెంటనే నత్రజని ఎరువును తాత్కాలికంగా నిలిపి, పొటాష్ ఎరువులు ఎకరాకు 15 కిలోలు చొప్పున వేయాలని ఆమె సూచించారు.

వెదజల్లే పద్ధతితో వరి సాగులో ఖర్చు ఆదా



మాట్లాడుతున్న వరి పరిశోధనా కేంద్రం సహ సంచాలకురాలు డాక్టర్ వరలక్ష్మి

ఉండి : వెదజల్లే పద్ధతిని అనుసరిస్తే రైతులు వరి సాగులో ఖర్చులు తగ్గించుకుని అధిక లాభాలు పొందవచ్చునని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ వరి పరిశోధనా కేంద్రం సహ పరిశోధనా సంచాలకురాలు డాక్టర్ ఎం.వరలక్ష్మి అన్నారు. ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని కృషీ విజ్ఞాన కేంద్రంలో సోమవారం శాస్త్రీయ సలహాసంఘ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన విస్తరణాధికారి డాక్టర్ బి.ముకుందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ రైతుల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ వారికి శాస్త్రవేత్తలు తగు సేవలు అందించాలన్నారు. డాక్టర్ ముకుందరావు మాట్లాడుతూ కేవీకే, ఏరువాక కేంద్రాలు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలతో కలసి పనిచేయాలని సూచించారు. చిరుధాన్యాల ప్రాముఖ్యతను తెలియచెప్పి వాటి సాగుకు రైతులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో కేవీకే హెడ్ డాక్టర్ మల్లిఖార్జునరావు, డీపీఎం వై నూకరాజు, ప్రకృతి వ్యవసాయం డీపీఎఫ్ ఈ ఆనందరావు, మత్స్య పరిశోధనా కేంద్రం ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ నీరజ, మార్టేరు, కేవీకే, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

నేడు నగర పంచాయతీ సమావేశం

ఆకివీడు : స్థానిక నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఛైర్‌పర్సన్ జామి హైమావతి సోమవారం చెప్పారు. సమావేశంలో నగర పంచాయతీ పరిధిలోని అభివృద్ధి పనులు, నిధుల కేటాయింపులు తదితర అంశాలపై చర్చ, తీర్మానాలు ఉంటాయన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

భీమవరం అర్బన్ : ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. భీమవరం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నరసింహపురం గ్రామంలో నన్నేటి ఇశ్రాయేలు ఒక ప్రైవేటు ద్విచక్ర వాహనం షాపులో వాచ్ మెన్‌గా పనిచేస్తుంటాడు. సోమవారం ఉదయం ఇశ్రాయేలు రోడ్డు దాటుతుండగా ఉండి నుంచి భీమవరం వైపు వెళుతున్న యాక్టివా ద్విచక్రవాహనం బలంగా ఢీకొట్టడంతో తలకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఇశ్రాయేలు ఫిర్యాదు మేరకు ఏఎస్సై ఆకురాతి సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మైనర్ కిడ్నాప్ కేసులో వ్యక్తి అరెస్ట్

ఆకివీడు : మైనర్ కిడ్నాప్ కేసులో ఉండి మండలం కలిసిపూడికి చెందిన కొక్కిర చందు అనే వ్యక్తిని కిడ్నాప్, పోక్సో చట్టం కింద అరెస్టు చేసినట్లు ఎస్సై కె.రాజారెడ్డి సోమవారం చెప్పారు. అతన్ని భీమవరం పీజేసీజే కోర్టులో హాజరు పరచగా 15 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

జూదరుల అరెస్ట్

ఆకివీడు : దుంపగడప గ్రామంలో మూలలంక గట్టుపై సోమవారం కోడి పందేలు నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తుల్ని అరెస్టు చేసినట్లు ఎస్సై కే.రాజారెడ్డి చెప్పారు. వారి వద్ద నుంచి రూ.1,600 నగదు, రెండు కోళ్ల, కోడి కత్తులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

స్పందనలో 5 ఫిర్యాదులు

ఆకివీడు : స్పందన కార్యక్రమంలో ఐదు ఫిర్యాదులు అందినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్ఎస్.శ్రీకర్ సోమవారం చెప్పారు. చెరుకుమిల్లి గ్రామానికి చెందిన వల్లూరి పెద్దిరాజు గృహనిర్మాణ పథకంలో తన ఆస్తి తనఖా పెట్టి రుణం తీసుకుని చెల్లించగా, తిరిగి దస్తావేజులు ఇప్పించాలని ఫిర్యాదు చేశారు. దుంపగడప గ్రామంలోని పంట బోదెను ఆనుకుని రొయ్యలచెరువు సాగు చేయడమే కాకుండా చెరువులోని కలుషిత నీటిని పంట కాల్వలోకి వదిలివేస్తున్నారని అద్దేపల్లి ప్రభాకరరావు, ఆదినారాయణ, సూరంపూడి వెంకట రాంబాబు ఫిర్యాదు చేశారు. పంట కాల్వకు చేర్చి రొయ్యల చెరువులు చేస్తున్న ముద్దే రామకృష్ణ, నాగేశ్వరరావు, గంధం శ్రీనులపై స్పందనలో అనేకసార్లు ఫిర్యాదు చేసినా చర్య తీసుకోలేదని వారు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎంపీడీఓ చెప్పారు.

ఆకివీడు సంతమార్కెట్‌ను అభివృద్ధిచేయాలని అజ్జమూరు గ్రామానికి చెందిన వర్ధినీడి శ్రీరామ చంద్రమూర్తి ఫిర్యాదు చేశారు. తన రైస్‌మిల్లు పార్టనర్‌లు జమా ఖర్చులు, రికార్డులు, తెలపకుండా, తన సంతకాల్ని ఫోర్జరీ చేస్తున్నారని సమయమంతుల శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. కోళ్లపర్రు గ్రామానికి చెందిన యిండుగుమిల్లి సీతామహాలక్ష్మీ తన పంట భూమికి పట్టాదారు పాస్ పుస్తకం ఏడాది కాలంగా ఫిర్యాదు చేస్తున్నా ఇవ్వడంలేదని స్పందనలో ఫిర్యాదు చేసినట్ల ఎంపీడీఓ శ్రీకర్ తెలిపారు.

ఫిష్ అవుట్‌లెట్లకు రుణాలు మంజూరు చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్) : ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్స్ ఏర్పాటుకు గుర్తించిన లబ్దిదారులకు రుణాలను త్వరితగతిన మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్స్ ఏర్పాటుపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫిష్ అవుట్‌లెట్స్ ఏర్పాటుకు అనువైన స్థలాలను క్షేత్రస్థాయిలో గుర్తించే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. బ్రతికున్న చేపల స్టాల్స్, పెద్ద రెస్టారెంట్లు ఏర్పాటు చేయుటకు యూనిట్ ఒక్కింటికి రూ.లక్ష నుంచి రూ.50 లక్షల వరకు సబ్సిడీపై రుణ సదుపాయం పొందవచ్చన్నారు. ఫిష్ అవుట్‌లెట్స్ ఏర్పాటుకు లబ్ధిదారులు ముందుకు వచ్చేలా ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, ఇన్‌చార్జి జిల్లా మత్స్య శాఖ అధికారి బి.రాజ్‌కుమార్, ఏడీ ఇ.ఆనందరావు, ఎల్‌డీఎం ఎస్వీవీ రమణ, మత్స్య శాఖ ఎఫ్డిఓలు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై తక్షణ చర్యలు



స్పందనలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సమస్యలను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ యు.రవిప్రకాష్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం భీమవరం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం మాట్లాడారు. సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి సత్వర న్యాయం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. స్పందనలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 19 ఫిర్యాదులందగా వాటిలో సివిల్ వివాదాలు 10, ఇతర సమస్యలు సంబంధించినవి 5, కుటుంబ కలహాలకు సంబంధించినవి 4 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారుల నుంచి స్వయంగా అర్జీలను స్వీకరించి సమస్య అడిగి తెలుసుకున్నారు.

వీరవాసరంలో అవగాహన ర్యాలీ

వీరవాసరం : కుష్టు వ్యాధి నివారణ అవగాహన వారోత్సవాల్లో భాగంగా సోమవారం వీరవాసరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు జి.మణిత్యాగి మాట్లాడుతూ స్పర్శ లేని మచ్చలు, తిమ్మిర్లు ఉన్న కాళ్ల చివరి భాగాలు, మచ్చలు కుష్టు వాధి లక్షణాలుగా పరిగణించి వైద్యులను సంప్రదించాలన్నారు. ఎండీటీ మాత్రలద్వారా కుష్టు వ్యాధిని నయం చేయవచ్చని వివరించారు. వీరవాసరం పీహెచ్‌సీ నుంచి తూర్పు చెరువు సెంటర్‌వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ చికిలే మంగతాయారు, సీహెచ్‌ఓ జి.దేవదాసు, హెల్త్ సూపర్‌వైజర్ జీవీవీ సత్యనారాయణ, వై.నరేంద్ర, చిట్టి బాబు, తానీషా, ఆరోగ్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన

ఉండి : కుష్టు వ్యాధి నివారణోత్సవాలను సోమవారం నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ పి.ధర్మతేజ్ తెలిపారు. సోమవారం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి నివారణపై గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కుష్టు వ్యాధిని నయం చేసేందుకు మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బి.సాయిచంద్ర, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నేడు సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన

ఆకివీడు : కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని జగనన్న కాలనీలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ ఫీర్ అహ్మద్ ఖాన్ సోమవారం చెప్పారు. సుమారు రూ.3.20 కోట్ల వ్యయంతో తాళ్లకోడులోని జగనన్న కాలనీని విద్యుద్దీకరణ చేస్తున్నామన్నారు. డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నర్సింహారాజు శంకుస్థాపన చేస్తారని డీఈఈ తెలిపారు.